సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 21 । మార్చి । 2024



23 ఏళ్లకు మోక్షం..

రామప్ప దేవాలయంలోని సోమసూత్రం మూసుకుపోవడంతో రెండు రోజులుగా పురావస్తుశాఖ సిబ్బంది డ్రిల్లింగ్ పనులు చేపట్టి సోమసూత్రాన్ని పునరుద్ధరించారు. - 8లో



అపరాలపై అనాసక్తి..!

అపరాల ఉత్పత్తులపై రైతులు ఆసక్తి చూపక పోవడంతో పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు 6:33	శుక్ర 4:51

హనుమకొండ ఫాతిమానగర్ బార్ ఎదుట మెయిన్‌రోడ్‌పై.., జిల్లా కోర్టు మెయిన్ గేట్ ముందు నుంచి అమరవీరుల స్తూపం జంక్షన్ వరకు.., సుబేదారి ఆర్ట్స్‌అండ్‌పీజీ కళాశాల ముందు మెయిన్‌రోడ్‌పై అంబులెన్స్‌ల పార్కింగ్, నయింనగర్‌లో కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎదుట రోడ్ మధ్య వరకు..









పార్కింగ్‌కు నో ప్లేస్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు పెరిగిపోతున్నాయి. వాటిలో వివిధ కొనుగోళ్లు, పనుల కోసం వచ్చిన వాహనదారులకు పార్కింగ్ స్థలం అందుబాటులో ఉంచడం లేదు. దీంతో రోడ్డుపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్నిచోట్ల అంబులెన్స్‌లు, ఆటోలను రోడ్డువెంట నిలుపుతుండడంతో మిగతా వారికి ఇబ్బందిగా మారింది. కొన్నిసార్లు ట్రాఫిక్ జామవడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. పార్కింగ్ స్థలం లేకుండా షాపింగ్‌కాంప్లెక్స్‌లకు ఎలా అనుమతిస్తున్నారో బల్దియా అధికారులకే తెలియాలి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఐపీఎస్ అధికారి



వరంగల్ క్రైం: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంకిత్‌యాదవ్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అటాచ్మెంట్ చేస్తూ.. రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఐపీఎస్ అధికారి అంకిత్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు పలు విషయాలపై కాసేపు చర్చించుకున్నారు.

ఫోరెన్సిక్‌కు రైలు బోగీ శాంపిళ్లు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే యార్డు ప్రాంతంలో జరిగిన రైలు బోగి ఘటనకు సంబంధించిన శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)కి పంపించినట్లు బుధవారం రైల్వే పోలీసులు తెలిపారు. మార్చి 5న రైల్వే యార్డులో నిరుపయోగంగా ఉన్న రైలు బోగి దగ్ధమైన విషయం విదితమే. ఈఘటనపై ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్ట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, శస్త్ర చికిత్స కాన్పులు తగ్గించాలని, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు, ఎంఎల్‌పీహెచ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. 108, 102 వాహనాల సేవల్ని రాత్రి సమయాల్లో కూడా వినియోగించుకోవాలని, పిల్లలకు వందశాతం వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, బస్తీ దవాఖాల్లో రోగుల సేవలను పెంచాలని సూచించారు. నీతి ఆయోగ్ ఇండికేటర్లను పెంపొందిస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎండీ యాకూబ్ పాషా, డీటీసీఓ హిమ బిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఉమాశ్రీ, ప్రోగ్రాం అధికారి చైల్డ్ హెల్త్, ఇమ్యునైజేషన్ డాక్టర్ ఇఫ్తాధర్ అహ్మద్, ఇన్‌చార్జ్ జిల్లా మాస్ మీడియా అధికారి ఎల్.చంద్రశేఖర్, వైద్య అధికారులు, డీడీఎం ప్రవీణ్, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు




హన్మకొండ అర్బన్: టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం వారి చేతుల మీదుగా హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ డైరీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆకుల రాజేందర్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్, లక్ష్మీప్రసాద్, నాయకులు సలీం, రామ్ ప్రసాద్, రాజేశ్ ఖన్నా, భరత్, శ్యామ్, రాజు, పృథ్వీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒక్కొక్కరుగా..

బీఆర్‌ఎస్‌ను వీడుతున్న కీలక నేతలు

- కాంగ్రెస్, బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్.. ఉమ్మడి వరంగల్‌లో సత్ఫలితాలు
- కడియం కావ్య అభ్యర్థిత్వంపై జేఏసీ నేతల కినుక
- ఉద్యమ నేతలతో పోచంపల్లి, దాస్యం, పెద్ది భేటీ
- గులాబీ దళపతి కేసీఆర్‌ను కలిసి మాట్లాడిస్తామని హామీ
- పార్టీ మారుతారని 'ఎర్రబెల్లి'పై ప్రచారం.. వివరణ ఇచ్చిన దయాకర్‌రావు
- ఉమ్మడి జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయాలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల్లో రోజుకో తీరుగా జరుగుతున్న పరిణామాలు ఆయా పార్టీల కేడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ సత్ఫలితాలనిస్తోంది. నిన్న మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించిన కొందరు కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడాన్ని ఆ పార్టీ ముఖ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతుండడం కేడర్‌లో చర్చనీయాంశమవుతోంది. ఇందులో ఆపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఉండడం గమనార్హం. ఇప్పటికే ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సహా పలువురు కీలక నేతలు కారు దిగారు. గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తాజాగా కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై కొందరు తెలంగాణ ఉద్యమకారులు కినుక వహించి బహిరంగంగానే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయిందేదో అయ్యింది.. ఉన్న కొందరినైనా ఏకతాటిపైకి తెచ్చేందుకు అధిష్టానం రంగంలోకి దిగడం బీఆర్‌ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది.

అభ్యర్థుల ప్రకటనపై ఉద్యమకారుల కినుక...

లోక్‌సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న తరుణంలో తెలంగాణ ఉద్యమకారులు, కేయూ జేఏసీ నాయకులు పలువురు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారికే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి తెచ్చారు. ఇదే సమయంలో ఈ నెల 13న వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును పార్టీ అధిష్టానం ప్రకటించగా.. ఉద్యమకారులు కొందరు ఆమెకు కాకుండా ఉద్యమంలో పాల్గొన్న వారికే ఇవ్వాలంటూ నిరసన తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఇతర నాయకులు, వరంగల్ జిల్లాకు సంబంధించిన ముఖ్యులు వారితో మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రంగంలోకి దిగిన పార్టీ అగ్రనేతలు ఇద్దరు.. వారితో చర్చలు జరపాలని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు సూచించినట్లు తెలిసింది. హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ కాలేజీలో బోడ డిన్నా, జోరిక రమేష్, నిరంజన్, చింతల యాదగిరి, సదానందం, బండి రజనీకుమార్ తదితరులతో మంగళవారం సుమారు గంటన్నర పాటు చర్చలు జరిపినట్లు ఆలస్యంగా తెలిసింది. ఉద్యమంతో సంబంధం ఉన్న వారికే టికెట్ ఇవ్వాలని, కేసీఆర్‌తో తమను మాట్లాడించాలని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఇందుకు 'మేం అగ్రనేతల సూచనల మేరకు మాట్లాడుతున్నాం. ఏమన్నా ఉంటే కేసీఆర్ సార్‌తో తప్పకుండా మాట్లాడిస్తాం.. అప్పటిదాకా పార్టీతో డిఫర్ కావొద్దు' అని సంప్రదింపుల కమిటీ హామీ ఇవ్వడంతో వేచి చూసే ధోరణి కొనసాగుతోంది.

'ఆకర్ష్' నేతలే అభ్యర్థులు... కాంగ్రెస్, బీజేపీల పాచికలు

కారణాలేమైనా కాంగ్రెస్, బీజేపీలు అమలు చేస్తున్న 'ఆకర్ష్'లో భాగంగా పార్టీలు మారిన నేతలే లోక్‌సభ అభ్యర్థులు అవుతున్నారు.

- మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ ఉద్యమ నేత ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ పలుమార్లు పార్టీ అగ్రనేతలను కలిసే ప్రయత్నం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కీలకంగా పని చేసిన ఆయన ఈసారైనా తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలన్న కోరికను బీఆర్‌ఎస్ మన్నించలేదు. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో కమలం కండువా కప్పుకున్న సీతారాం నాయక్‌కు ఆపార్టీ అధిష్టానం మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది.
- బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశించగా అధిష్టానం విముఖత వ్యక్తం చేసిందన్న ప్రచారం ఉంది. ఇదే సమయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో రమేశ్ బీజేపీలో చేరగా.. ఆయనే వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కానున్నారు.
- కనీసం సభ్యత్వం కూడా లేని వారిని ఎంపీ అభ్యర్థి చేశారన్న ఆవేదన వ్యక్తం చేసిన బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ పార్టీకి, పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయనే కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అయ్యే అవకాశం ఉందన్న ప్రచారం బుధవారం నుంచి సాగుతోంది.
- ఎంపీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతుండడం కలకలం రేపుతోంది.
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బీజేపీలో చేరుతారనే వార్తలొచ్చాయి. దీనిపై ఆయన మంగళవారం హనుమకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. తాను బీఆర్‌ఎస్‌ను వీడేది లేదని స్పష్టత ఇచ్చారు. దోపిడీదారులే పార్టీని వీడుతున్నారని, తాను కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పుకొచ్చారు.

లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించండి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. బ్యాంకుల ద్వారా జరిగే నగదు లావాదేవీలు, ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసిన వస్తువుల వివరాలు, స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల వివరాల్ని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో.. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, తదితర శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో వైన్స్‌లకు కేటాయించే మద్యం వివరాలు డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేశ్, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగారలే, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు వెంకటేశ్, నారాయణ, డీఆర్డీఓ నాగ పద్మజ, జిల్లా ట్రెజరీ డీడీ రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నిబంధనలు పాటించాలి..

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈసీ నిబంధనల మేరకే నగదు లావాదేవీల నిర్వహణ ఉండాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేశ్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయండి

ఎంజీఎం: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని లెప్రసీ ఎల్సీడీసీ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మైఖేల్ అన్నారు. కుష్ఠు వ్యాధి నివారణలో భాగంగా 'ఇంటింటికీ వ్యాధిపై అవగాహన, నిర్ధారణ' కార్యక్రమాన్ని బుధవారం నగరంలో నిర్వహించారు. జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అదనపు డీఎంహెచ్ఓ మదన్మోహన్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలకులు మైఖేల్ హనుమకొండలోని బోడగుట్ట, వడ్డేపల్లి, హసన్‌పర్తి ఆరోగ్య కేంద్రాల్లోని కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తలు చేపడుతున్న సర్వే తీరు, తదితర విషయాలను ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు జేరుసా, పద్మావతిరెడ్డి, డీపీఎంఓలు కొమురయ్య, గోపాల్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, రవీందర్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మైఖేల్, అధికారులు, సిబ్బంది

అభివృద్ధికి పట్టం కట్టాలి..

- మరోసారి మోదీకి అవకాశమివ్వాలి
- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

హన్మకొండ: దేశంలో మరోసారి నరేంద్ర మోదీ సర్కార్ అధికారంలోకి రానుందని, ప్రజలందరూ అభివృద్ధికి పట్టం కట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్ అన్నారు. బుధవారం హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఒంటిమామిడిపల్లి, ఐనవోలు, ఏనమాముల నుంచి పలువురు నాయకులు అరూరి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఆపార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అరూరి మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అండగా నిలుస్తూ.. బీజేపీకి ఓటు వేయాలన్నారు. ధర్మారావు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందని పార్టీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఐనవోలు దేవస్థాన మాజీ చైర్మన్ జైపాల్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, డైరెక్టర్ షణ్ముఖ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరుతున్న నాయకులు

నిబంధనలు విస్మరిస్తే అనుమతులు రద్దు

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: టీఎస్-బీపాస్ ద్వారా భవన నిర్మాణ ధ్రువీకరణ అనుమతులు పొందిన యజమానులు నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం హనుమకొండ పరిధి బాలసముద్రం, నక్కలగుట్ట, సర్క్యూట్ హౌస్ రోడ్, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి భవన నిర్మాణ అనుమతులు, నీటి సరఫరా, పన్ను వసూళ్ల తీరును పరిశీలించి సూచనలిచ్చారు. స్థానికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో సీఎంహెచ్ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈ రాజయ్య, డీఈ సంతోశ్, ఆర్ఓ సుదర్శన్, టీపీఓలు సుష్మ, బషీర్, మేనక, విజయలక్ష్మి, శ్రీను, అనిల్, రజని పాల్గొన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయండి

ఆస్తి పన్ను వసూలు గడువు కేవలం 11 రోజులు మాత్రమే ఉందని, రూ.33.70 కోట్లు వసూలు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. బుధవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో పన్ను వసూళ్ల పురోగతిపై కమిషనర్ సమీక్ష నిర్వహించి వసూళ్లపై దిశానిర్దేశం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ. 97.66 కోట్లు కాగా.. ఇప్పటి వరకు 60 శాతం రూ.63.96 కోట్ల పన్నులు సేకరించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఆర్ఓలు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

ఉచిత శిక్షణ, ఉపాధి

వరంగల్ అర్బన్: భవన నిర్మాణ, దానిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు హనుమకొండ జిల్లా న్యాక్ అధికారి గోపాల్ బుధవారం పేర్కొన్నారు. 18–30 మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులని, ఉచిత శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 79892 47723లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

కరీమాబాద్ : ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సీజ్ చేసిన వాటిని సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. హనుమకొండలోని 'కుడా' కార్యాలయం కాంప్లెక్స్, జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ సెల్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ రికార్డుల నిర్వహణ, పోలీస్ బందోబస్తు రికార్డుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, సహకార అధికారి సంజీవరెడ్డి, డీటీఓ విజయసారథి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుమలత, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అనిల్ పాల్గొన్నారు.



జిల్లా సహకార శాఖ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందించాలి

ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మీడియా సంస్థలు.. అభ్యర్థుల ప్రచార ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే ప్రసారం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ అయూబ్‌అలీ, అదనపు డీపీఆర్ఓ ప్రేమలత, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా రాజమణి

కేయూ క్యాంపస్: కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రాజమణిని నియమిస్తూ.. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన తెలుగు విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సదాశివ్ స్థానంలో డాక్టర్ రాజమణిని నియమించారు.

వైద్యులకు షోకాజ్ నోటీసులు

ఎంజీఎం: వరంగల్‌లోని పలువురు వైద్యులకు బుధవారం తెలంగాణ వైద్య మండలి(టీఎస్‌ఎంసీ) షోకాజ్ నోటీసులు పంపించింది. ఇటీవల నర్సంపేట రోడ్డులోని ఓగార్డెన్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ ప్రథమ మహా సభలు జరిగాయి. పలు ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగా నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తూ వారి అసోసియేషన్ సభ్యులకు పెద్ద మొత్తంలో నగదు ఇచ్చినట్లు సమాచారం. ఎన్ఎంసీ చట్టాలకు విరుద్ధమైన చర్యలు పాల్పడినట్లు టీఎస్‌ఎంసీ గుర్తించి ఆస్పత్రుల రిజిస్టర్డ్ వైద్యులకు షోకాజ్ నోటీసులిచ్చింది. ఈఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఐఎంఏ తానా ప్రెసిడెంట్ ఆదేశాలు జారీ చేశారు. వరంగల్‌కు చెందిన రుషాలి ఆస్పత్రి, కూరపాటి హాస్పిటల్, ముత్యం కిడ్నీ సెంటర్, ప్రతిమా రిలీఫ్ ఆస్పత్రులు నోటీసులు అందుకున్న జాబితాలో ఉన్నాయి. పది రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, సంతృప్తికరంగా లేకుంటే.. టీఎస్‌ఎంసీ మెడికల్ రిజిస్టర్ నుంచి తాత్కాలికంగా లేదా.. శాశ్వతంగా వారి రిజిస్ట్రేషన్లను తొలగిస్తామని నోటీసుల్లో హెచ్చరించారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్, రిమాండ్

- 2 కిలోల 900 గ్రాముల సరుకు స్వాధీనం



అరెస్టు చూపుతున్న పోలీసులు

మడికొండ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మడికొండ సీఐ ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాజీపేట మండలం బొడగుట్టకు చెందిన కొంగరి పవన్ కల్యాణ్, కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన వేల్పుల ఆనంద్, కాజీపేట వైఎస్ఆర్ నగర్‌కు చెందిన గాలి తరుణ్ స్నేహితులు. వీరిలో వేల్పుల ఆనంద్ కొంత కాలంగా విశాఖపట్నం అరకులో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. అనంతరం చిన్న ప్యాకెట్ల రూపంలో ఎక్కువ ధరకు కల్యాణ్, తరుణ్ ద్వారా కాజీపేటలో విక్రయించి వారికి కొంత మొత్తం లాభం ఇస్తున్నాడు. అయితే కల్యాణ్, తరుణ్ తమకు కూడా ఎక్కువ లాభం కావాలని డిమాండ్ చేశారు. దీంతో ముగ్గురు విశాఖపట్నం అరకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 2కిలోల 900 గ్రాముల ఎండు గంజాయి కొనుగోలు చేశారు. బుధవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో దిగారు. అనంతరం బైక్‌పై అయోధ్యపురం రైల్వే గేట్ పక్క దారి నుంచి గంజాయి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై దివ్య, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. సమావేశంలో ఎస్సై దివ్య, ఏఎస్సై చంద్రమౌళి పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రంపై పరిశోధనలు జరగాలి

హన్మకొండ : విజ్ఞాన శాస్త్రంపై పరిశోధనలు జరగాలని, ఆధునిక ప్రపంచంలో సైన్స్ అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేశ్ అన్నారు. హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాలలో బుధవారం '21వ శతాబ్దంలో వృక్ష విజ్ఞాన శాస్త్రంలో ఆధునిక పోకడలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ రమేశ్ పాల్గొని వర్క్‌షాపును ప్రారంభించి మాట్లాడారు. తెగుళ్లను తట్టుకునే వ్యాధి నిరోధక వంగడాలు, అధిక ఉత్పత్తి, పోషకాలు కలిగిన వంగడాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని సూచించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వాహినీ దేవి, ప్రిన్సిపాల్ శేషాచలం, వృక్షశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరాలపై అనాసక్తి..!

ఏటా పడిపోతున్న పప్పు దినుసుల సాగు

- వరి, పత్తి సాగు పైనే మోజు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం సాగు వానాకాలం 15,11,644, యాసంగి 9,08,035 ఎకరాలు
- పప్పు దినుసుల సాగు వానాకాలం 11,140, యాసంగి 7,337 ఎకరాలు

అపరాలు సాగు ఇలా.. (ఎకరాల్లో)

జిల్లా	వానాకాలం	యాసంగి
హనుమకొండ	595	153
వరంగల్	980	189
మహబూబాబాద్	5158	5,511
ములుగు	80	1,155
జయశంకర్ భూపాలపల్లి	184	358
జనగామ	4,143	240

ఉమ్మడి వరంగల్‌లో వరి సాగు ఇలా..

వరి సాధారణ సాగు 6,09, 787 ఎకరాలు

	వానాకాలం	యాసంగి
	8,99,515	6,51,387
గతేడాది	9,12,227	7,05,162



హన్మకొండ: ఏటికేడు పడిపోతున్న అపరాల సాగు ఆందోళన కలిగిస్తోంది. అపరాల ఉత్పత్తులపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో నిత్యావసరంగా మారిన పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వరి, పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు.. పప్పుదినుసుల సాగు అంటేనే కొంత వెనుకంజ వేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి, వరిసాగు విస్తీర్ణం, అపరాల సాగు గణాంకాలు చూస్తే రాబోయే రోజుల్లో కొన్ని పంటలు కనిపించకుండా పోయే ప్రమాదముందన్న విషయం స్పష్టమవుతోంది. ఒక వైపు పప్పుదినుసుల ధరలు చుక్కలనంటుతుండగా ఈ పంటల సాగుకు ఎందుకు మొగ్గుచూపడం లేదో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మాంసాహారంతో సమానంగా పోషకాలు అందించే పప్పు దినుసుల సాగు పెంపుపై వ్యవసాయ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

46,371 ఎకరాల్లోనే అపరాల సాగు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి వానాకాలంలో 15,11,644 ఎకరాలు, యాసంగిలో 9,08,035 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో వరి వానాకాలం 8,99,515 ఎకరాలు యాసంగిలో 6,51,387 ఎకరాల్లో, పత్తి 5,26,727 ఎకరాల్లో సాగు చేశారు. అపరాల సాధారణ సాగు 46,371 ఎకరాలుకాగా, వానాకాలంలో 11,140 ఎకరాలు, యాసంగిలో 7,337 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇందులో కంది వానాకాలంలో 6,231, యాసంగిలో 84 ఎకరాలు, పెసర వానాకాలంలో 4,727, యాసంగిలో 3,601, మినుములు వానాకాలంలో 177, యాసంగిలో 879 ఎకరాల్లో, శనగ యాసంగిలో 153 ఎకరాల్లో, బొబ్బెర యాసంగిలో 2,547 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ధాన్యం నిల్వలు పెరిగిపోయి క్రయవిక్రయాలు సమస్యగా పరిణమించడంతో ప్రభుత్వం వరి సాగు విస్తీర్ణం తగ్గించేందుకు కృషి చేస్తుంది. వరి సాగుతో ఏర్పడే ఇబ్బందులను వ్యవసాయ శాఖ ద్వారా ప్రచారం చేసినా పంట విస్తీర్ణం మాత్రం పెరుగుతూనే ఉంది.

వేలలో నుంచి వంద ఎకరాలకు పడిపోయిన అపరాల సాగు..

పప్పు దినుసుల పంటల సాగు వేలలో నుంచి వంద ఎకరాలకు పడిపోయింది. ఈ పంటలను ఎంత పెంచాలని ఆశిస్తున్నారో అంతకంటే వేగంగా సాగు పడిపోతోంది. ఫలితంగా ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న జనాభా మేరకు అపరాల ఉత్పత్తి లేకపోవడం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. అపరాల పంటలైన కంది, పెసర, మినుములు, శనగ, బొబ్బెర సాగు క్షీణిస్తోంది. కంది, పెసర, మినుములు కొద్దిగా సాగు చేస్తున్న శనగ సాగు కనిపించడం లేదు. బొబ్బెర నామమాత్రంగా ఎవరో ఒకరు సాగు చేస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం రాకపోవడంతోనే సాగుపై అనాసక్తి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రైతులు అపరాల సాగు చేయాలని భావించినా శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో పాటు కనీస మద్దతు ధర లభించకపోవడం, సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, సాగు నీరు పుష్కలంగా అందుబాటులోకి రావడం, ప్రభుత్వం నుంచి సాగుపై ప్రోత్సాహం కరువవడం, విత్తనాలకు రాయితీ ఇవ్వకపోవడం, కోతుల బెడద, తదితర కారణాలు పప్పు దినుసుల సాగుకు అవరోధంగా మారాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రోత్సహిస్తేనే అపరాల సాగు పెరిగే అవకాశముంది.

కోతుల బెడద ఎక్కువ ఉంది



నాకు ఉన్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న. గతంలో కందులు, పెసర్లు, బొబ్బర్లు లాంటి పప్పు దినుసుల పంటలు పండించేది. అయితే కోతుల బెడద ఎక్కువ కావడంతో పంటలు చేతికి వచ్చే వరకు నమ్మకం లేకుండా పోయింది. అన్ని రకాల పంటలపై కోతులు దాడులు చేసి నాశనం చేస్తున్నాయి. దీంతో అపరాల సాగు చేపట్టడం లేదు. దీంతో పప్పులు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. కోతులు బెడద పోతేనే కూరగాయలు, పప్పు దినుసులు పండిస్తాం.

- దామెర బాల్ నర్సయ్య, కేసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట

వరి, పత్తి పంటల వైపే మొగ్గు



నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒకప్పుడు నీటి లభ్యత లేక వర్షాలపై ఆధారపడి పప్పు దినుసుల పంటలు సాగు చేసేవాళ్లం. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యత పెరగడంతో వరి, పత్తి పంటలు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నాం. పప్పు దినుసుల సాగులో లాభాలు ఉన్నా కొంత ఎక్కువ శ్రమ చేయాల్సి వస్తుంది. దీనికి తోడు పప్పు దినుసులు విక్రయించడానికి సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో వరి, పత్తి, మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

-పల్లె బక్కిరెడ్డి, కమలాపూర్

23 ఏళ్లకు మోక్షం..



ఆలయం బయట నుంచి గర్భగుడిలోకి డ్రిల్లింగ్ వేస్తున్న సిబ్బంది



సోమసూత్రాన్ని పునరుద్ధరించడంతో గర్భగుడి నుంచి బయటకు వస్తున్న నీరు

సాక్షి ఎఫెక్ట్..

- 'సాక్షి' కథనాలతో కదిలిన కేంద్ర పురావస్తుశాఖ
- సోమసూత్రం పునరుద్ధరణ పనులు ప్రారంభం


అభిషేకం చేసేదెలా..!

12వతేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో సమస్యల పరిష్కారానికి తొలి అడుగుపడింది. ఆలయ గర్భగుడిలోని శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేస్తే ఆ ద్రవం బయటకు వెళ్లకుండా గర్భగుడిలోని సోమసూత్రం 23 ఏళ్ల క్రితమే మూసుకుపోయింది. దీనిపై 'సాక్షి' దినపత్రిక పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఇందులోభాగంగా మహాశివరాత్రి సందర్భంగా మార్చి 12న 'అభిషేకం చేసేదెలా..! మూసుకుపోయిన సోమసూత్రం, 23 ఏళ్లుగా చిలకరింపు అభిషేకాలే' అనే కథనం ప్రచురితమైంది. దీంతో కేంద్ర పురావస్తుశాఖ అధికారుల్లో చలనం మొదలైంది. ఇందులో భాగంగా వారం రోజులుగా సోమసూత్రం పునరుద్ధరించేందుకు నిపుణుల సాయంతో రహస్యంగా పరిశీలన చేశారు. మంగళవారం గర్భగుడిలోని సోమసూత్రం వద్ద పూజలు నిర్వహించి డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. బుధవారం కూడా డ్రిల్లింగ్ పనులు కొనసాగాయి. గర్భగుడి నుంచి సోమసూత్రానికి డ్రిల్లింగ్ వేయగా సుమారు మీటర్ వరకు క్లియర్ అయినట్లు తెలిసింది. ఆలయం బయట నుంచి రివర్స్‌గా గర్భగుడిలోకి డ్రిల్లింగ్ వేయగా సుమారు 1.5 మీటర్ వరకు క్లియర్ అయినట్లు స్థానిక సిబ్బంది పేర్కొన్నారు. మధ్యలో రాతి కృంగి అడ్డు రావడంతో తీవ్రంగా శ్రమించి డ్రిల్లింగ్ పనులు పూర్తి చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేష్‌ను 'సాక్షి' సంప్రదించగా రెండు రోజుల నుంచి డ్రిల్లింగ్ పనులు చేపట్టి సోమసూత్రాన్ని పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

శరీరదాన అంగీకార పత్రాలు అందజేత



అంగీకార పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఎంజీఎం : తమ మరణాంతరం మృతదేహాలను కుటుంబ సభ్యుల ద్వారా వైద్య విద్య నిమిత్తం దానం చేస్తామని అంగీకారం తెలుపుతూ తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, అనాటమీ అధిపతి డాక్టర్ పద్మజకు 25 మంది శరీర దాన (విల్) సర్టిఫికెట్స్ అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోనరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు యాదవ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణాంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేసి మానవాళికి మహాఉపకారం చేద్దామని పిలుపునిచ్చారు. శరీర దానం చేసే దాతలు 8790548706, 9703738699 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉపేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కేదారి, అనాటమీ సిబ్బంది మహబూబ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాజీపేట : చిరువ్యాపారుల దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతున్న కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కొంత కాలంగా గుర్తు తెలియని వ్యక్తి కాజీపేటలో పలు పూలు, పండ్లు, కూరగాయల దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న విషయం విదితమే. కాగా, రెండు రోజుల క్రితం సదరు నిందితుడు బైక్‌పై కాజీపేట సెయింట్ జోసఫ్ చర్చి ఎదుట ప్రధాన రహదారిపై ఉన్న దుకాణానికి వచ్చి పండ్లు ప్యాక్‌చేసి ఇవ్వాలని వ్యాపారికి చెప్పాడు. అనంతరం అదును చూసి గల్లా పెట్టెలోని నగదు తీసుకుని ఉడాయించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి డబ్బులు చూసుకోగా కనిపించకపోవడంతో ఇంతకు ముందు వచ్చిన వ్యక్తి చేతిలో మోసపోయినట్లు గుర్తించిన చిరువ్యాపారి తాను ఏర్పాటు చేసుకున్న సీసీ ఫుటేజీని పోలీసులకు ఇచ్చి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వాహనం నంబర్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల నుంచి పట్టణంలో ఎక్కడా చోరీలు జరగకపోవడం కూడా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు వ్యాపారులు భావిస్తున్నారు. పోలీసులు మాత్రం అలాంటి విషయం ఏమీలేదని, విచారణ ఇంకా కొనసాగుతుందని చెబుతున్నారు.

హ్యాండ్‌బాల్, క్రికెట్ రెండు కళ్లు



మాట్లాడుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు
- హ్యాండ్‌బాల్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో అర్జునుడిలా పోరాడి విజయం సాధించానని హెచ్‌సీఏ ప్రెసిడెంట్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. వరంగల్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జగన్మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయినప్పటికీ మొదట తాను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడినని మరవనన్నారు. హ్యాండ్‌బాల్, క్రికెట్ రెండు క్రీడలు తనకు రెండు కళ్లు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే డీఎస్ఏలో కొనసాగుతున్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఇక్కడి నుంచి తరలించాలని కొందరు చూస్తున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇక్కడే కొనసాగేలా కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్‌లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ అందిస్తామన్నారు. అందుకోసం మొదటిసారి వరంగల్ జిల్లా వేదికగా ఏప్రిల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులకు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో శిక్షణ అందిస్తామన్నారు. అతి త్వరలో వరంగల్ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఇండ్లనాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, సాంబరాజు రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా బీ అశోక్, కోశాధికారిగా బి నరేందర్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, చందర్, శ్రీను తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో వరంగల్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర బాధ్యుడు ఫ్రాంక్లీన్, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల సారంగపాణి, అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి సారంగపాణి, మూగల కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇండ్ల నాగేశ్వర్‌రావు



బొడ్డు విష్ణువర్ధన్

ఆలుగడ్డల కోసం వచ్చి గొలుసు లాక్కెళ్లాడు!



బాధితురాలితో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: ఆలుగడ్డలు కావాలని వచ్చిన ఓ యువకుడు కిరాణా దుకాణ నిర్వాహకురాలి మెడలోంచి గొలుసును లాక్కెళ్లాడు. యాదవనగర్ సమీపంలోని విజయలక్ష్మీ కాలనీకి చెందిన బండెల రమాదేవి స్థానికంగా కిరాణా దుకాణం నడుపుతోంది. మంగళశారం రాత్రి ఆలుగడ్డలు కొనేందుకు ఓ యువకుడు హెల్మెట్ ధరించి బైక్‌పై దుకాణానికి వచ్చాడు. షాపు నిర్వాహకురాలు రమాదేవి అజాగ్రత్తగా ఉండడం గమనించిన అతడు ఆమె మెడలోని సుమారు ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొలుసు అపహరణ జరిగిన తీరును బాధితురాలు పోలీసులకు వివరించింది.ఈమేరకు కాకతీయ యూనిర్సిటీ ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు.

కమిటీ సిఫార్సులు వెల్లడించాలి

- రిజిస్ట్రార్ చాంబర్ వద్ద ఆందోళన



వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని సీటు రాని అభ్యర్థులు, ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు ఆరోపించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల త్రిసభ్య కమిటీని నియమించగా కేయూలో విచారించిన విషయం విదితమే. అనంతరం త్రిసభ్య కమిటీ నివేదికను కూడా ప్రభుత్వానికి సమర్పించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించి త్రిసభ్య కమిటీ పలు సిఫార్సులు చేసిందని, వాటిని ఈ నెల19న కేయూ అధికారులు పంపారని సమాచారం. దీంతో బుధవారం త్రిసభ్యకమిటీ ఇచ్చిన రికమండేషన్ల రిపోర్టుపై బుధవారం వివిధ విభాగాల డీన్లతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం రిజిస్ట్రార్ తన చాంబర్‌కు రాగా త్రిసభ్యకమిటీ సిఫార్సుల్లో ఏముందో వెల్లడించాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు రిజిస్ట్రార్‌ను డిమాండ్ చే శారు. ఈ సందర్భంగా వాగ్వాదానికి దిగారు.

కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

- ఉద్యోగాల నుంచి తొలగించాలనే యత్నం సరికాదు



నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం రెండోరోజు ఆందోళనకు దిగారు. తొలుత క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ చాంబర్ వద్ద ఆందోళనతో పాటు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైకోర్టులో తమ నియమాకాలపై ఈనెల 22న కేసు విచారణ ఉన్నందున కేయూ స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది)ను ఎట్టిపరిస్థితుల్లోను కోర్టుకు పంపకూడదన్నారు. ఆయన స్థానంలో ప్రభుత్వానికి సంబంధించిన అడ్వకేట్ జనరల్‌ను లేదా సీనియర్ అడ్వకేట్‌ను పంపాలని లేదా కేసును వాయిదా వేయించేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు.14ఏళ్లుగా తాము అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తు మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. తమను ఉద్యోగాల నుంచి తొలగించాలనే యత్నాలు సరికాదన్నారు. వీసీ రమేశ్ రెండేళ్ల క్రితం 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లను పరిరక్షిస్తామని పేర్కొన్నారని, ఇప్పుడు మూడేళ్లు పూర్తికావొస్తున్నా పరిరక్షించకపోగా తమను ఉద్యోగాల నుంచి తొలగించే యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డితో వాగ్వివాదానికి దిగారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్టాండింగ్ కౌన్సిల్‌ను మార్చే విషయంపై వీసీతో మాట్లాడాల్సి ఉంటుందన్నారు. సాయంత్రం అసిస్టెంట్ ప్రొఫెసర్లంతా వీసీ ఛేషీకి వెళ్లి అక్కడ బైఠాయించి తమ నిరసన తెలిపారు. రిజిస్ట్రార్ చాంబర్‌కు వచ్చి ఆందోళన కొనసాగించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేశ్‌కు అస్వస్థత..

కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళనలో భాగంగా అస్వస్థతకు గురైన కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేశ్ తేరుకున్నట్లే కనిపించినా అనంతరం మళ్లీ అస్వస్థతకు గురికావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో పాటు పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం ఆస్పత్రికి వెళ్లి రమేశ్‌ను పరామర్శించారు.

లోకోషెడ్ తనిఖీ



వినతిపత్రం అందజేస్తున్న రైల్వే సంఘ్ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో బుధవారం సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) గోపాల్ తనిఖీలు చేపట్టారు. ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లోని వివిధ సెక్షన్లను పరిశీలించారు. సెమినార్ హాల్‌లో ఎలక్ట్రిక్ లోకో షెడ్ డెవలప్‌మెంట్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. తనిఖీల్లో ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్‌కృష్ణసాయి, డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏడీఆర్ఎంకు వినతి..

షెడ్‌కు తనిఖీ నిమిత్తం వచ్చిన ఏడీఆర్ఎం గోపాల్‌కు షెడ్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచ్ నాయకులు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వినతి అందించిన వారిలో.. ఈఎల్ఎస్ బ్రాంచీ సెక్రటరీ బల్విందర్‌సింగ్, మాధవరావు, సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటనారాయణ, సాంబమూర్తి, కుమార్, విజయ్‌కుమార్, శారద పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్ : జాతీయ నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. కేయూ దూర విద్యాకేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ 51వ మహాసభను నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా మూర్తి హాజరై మాట్లాడారు. శాస్త్రీయ దృక్పథం లేని నూతన జాతీయ విద్యావిధానం–2020ను రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నీరుగార్చేవిధంగా యత్నిస్తున్నారన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

కేయూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి ప్రకటించారు. అధ్యక్షుడిగా సాయికిరణ్, కార్యదర్శిగా స్టాలిన్, ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయ కార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ పలు తీర్మానాలు చేసింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.